పంతుల శ్రీరామశాస్త్రి

# ★ విఫలం ★

భానుమూర్తి పంతులుకి ఇద్దరు కొడుకుల తరవాత పుట్టిన గారాబు కూతురు అనసూయ.

తాను కలక్టరీ చేస్తున్నాడాయన, అందులోనూ ఒక్కగా నొక్క కూతురు. అంతేకాదు, తల్లి లేనిది కూడా—అగిన గొప్ప సంబంధం తేవద్దా—ఎలాగైతేనేం సాధించాడు. హైకోర్టు జడ్జీ పదవిని అందుకొన్న రాజశేఖర శాస్త్రిగారి కుమారుడు రంగనాథుడు, అమితమయిన కట్నంతో సహా ఇచ్చి అశేషమయిన వైభవంతో పెళ్ళిచేసేరు. అయితే అక్కడితో సరిపడలేదు. ఇంజనీరింగులో స్వదేశీ డిగ్రీలతో తృప్తిలేక అసలు డిగ్రీకోసం మామగారి ఖర్చుమీదుగా ఇంగ్లాండు ప్రయాణం కట్టేడు రంగనాథం—అసలు పెళ్ళిమాటలలో అదీ ఒక ముఖ్యమయిన షరతే.

భానుమూర్తి పంతులు డబ్బుఖర్చుకి ఎలాగయితేనేం సిద్ధపడ్డాడు. అమ్మాయికి ఆ సీలో ఎలాగూ సగం ఇవ్వదల్చుకొన్నవాడే కదా. ఎప్పుడో ఇచ్చేది, ఇప్పుడే ఖర్చుపెడితే, వాళ్ళ ఊసు మరి చూడనక్కరలేదు; నెలకి ఏ రెండు వేలో తెచ్చుకుంటాడు అని అనుకొన్నాడు. కాని, లేశమాత్రం భయంకూడా లేకపోలేదు. అతను అక్కడ విదేశంలో ఏమయినా దుర్భ్యసనాలకు లోనయితే, లేక ఏవయినా లంపటాలు తగిలించుకొనివస్తే, సర్వనాశనమవుతుందే—అలాగని మూర్ఖప్రజ్ఞలాగ అభివృద్ధికి అడ్డుపడితే ఎల్లాగ? అల్లుడు పక్కా దొరఅయి తీరవలసిందే.

అక్కడ రంగనాథంఉన్న కాలంలో భానుమూర్తి పంతులు అతనికి వ్రాసిన లేఖాపరంపరని నవీన భారతానికి నైతికోపనిషత్తుగా గణించవచ్చును. తాను స్వయంగా వ్రాయడమే కాదు, అనసూయనికూడా భర్తకి ఉత్తరాలు రాయమని ప్రోత్సహించేవాడు, భానుమూర్తిపంతులు. అయితే ఇక్కడ ప్రోత్సాహించటం అనే మాటకు కాస్త విపులమయిన అర్థాన్ని మనం చెప్పుకోవాలి. ఉపదేశం కాంతాసమ్మితంగా ఉంటేనే ఎక్కువ ఉపయోగకారిటుకదూ—అప్పటికి అనసూయ పద్నాలుగేళ్ల అమ్మాయే అయినా, రంగనాథాన్ని వ్యక్తిగతంగా అట్టే తెలియనానికి సావకాశం లేకపోయినా, భార్య భర్తకు ఏయే విధాలుగా ఉపదేశిస్తే బాగుంటుంది అన్న విషయాన్ని తన పేద్దాకితో ఊహించి, తాను చెప్పుతూఉండగా ఆమె వ్రాయడం జరిగేది. అది ఆ ప్రోత్సాహపు పటానికి అర్థము. అయితే ఆ జాబులు తాను అనువుగా చెప్పినవి కావడంవల్ల ఎన్నెన్నో తడుబాట్లు ఒదుబాట్లు హంసపాదులు వచ్చేవి. వీటన్నిటినీ సరిద్ది సాపు వ్రాయించే వేళకు సరికొన్ని మంచి అభిప్రాయాలు స్ఫురించేవి. మళ్ళీ మళ్ళీ వ్రాయవలసివచ్చేది. ఈ విధంగా పదేపదే వ్రాయడంవల్లనే ఆమె దస్తూరీ చాలా బాగుపడిందనటంలో అతిశయోక్తి లేశమూ లేదు.

భానుమూర్తిపంతులూ అనసూయా వ్రాసిన ఉత్తరాల ప్రాబల్యంవల్లనో, తనలోని అత్యంతమయిన విద్యాదీక్షవల్లనో, లేక విదేశంలో విచ్చలవిడిగా తిరగేటంతటి వాకచక్యం లేకపోవడంవల్లనో రంగనాథం సక్రమంగా డిగ్రీని సాధించి స్టీమరు దిగేడు.

అతని గౌరవార్థం బంధుమిత్రులు జరిపే టీ పార్టీలయినా ఒకటి అంతుపట్టక మునుపే, అనేక

సలాలనుండీ వస్తున్న ఉద్యోగాహ్వానాలతో ఏదీ స్వీకరించేసుకోకముందే రంగనాథం ఒక మూడు రోజులువచ్చిన సామాన్యమయిన జ్వరంతో ఈ లోకంనుండి సెలవు పుచ్చుకొన్నాడు.

అనసూయకంటె భానుమూర్తిపంతులే ఎక్కువగా ఏడిచేడు. అంతటి మహారత్నాన్ని పోగొట్టుకొనికూడా తెలుగుదేశం సామాన్యంగా నిత్యకృత్యాలలో నిమగ్నమయి ఉన్నందుకు ఆయన పెట్టిన శాపాలేగాని ఫలించివుండునా—ఫలితం ఏటంబాంబు (పరమాణ్వస్త్రం) పతనంకంటె భయంకరంగా ఉండివుండును.

అనసూయ దుఃఖాతిరేకంలో నేనిక జీవించి లాభంలేదు. నా బ్రదుకు మోడువారిన లత, వెన్నెలలేని రాత్రి, నా బ్రతుకు నిష్ఫలం, అందువల్ల ఆత్మహత్యే నాకు శరణ్యం అంది. ఆమెను భానుమూర్తిపంతులు ఓదార్చిన ధోరణిని, అనసూయ కాక మరెవ్వరయినా మామూలు మనిషైతే ఆత్మహత్యను కేవలం ప్రోత్సాహంగా భావించుకొనివుండును.

ఏమయితేనేం యథార్థానికి అనసూయ ఆత్మహత్య చేసుకోలేదు. అసలు ఆమెలోని పాతివ్రత్యమంతా, భానుమూర్తిపంతులు ప్రోద్బలంవల్ల కలిగినదేగాని, ఆమెకు సహజంగా భర్త రంగనాథంయెడల ఎటువంటి భావమూ కలగటానికి తగినంతగా అతని సాహచర్యభాగ్యము లభించలేదు. స్వదేశంలో ఉన్న కొద్దిరోజులూ అతడు పరీక్షల తాపత్రయంలో నే గడిపేడు. ఏదో తెచ్చిపెట్టుకున్నట్టుగా వ్రాసిన ఉత్తరాలవల్ల ఆత్మీయత కలుగుతుందా, తాను చదివిన పుస్తకాలలోని మనుష్యుల స్వభావాలను తెలిసినపాటికూడా ఆమెకు రంగనాథాన్ని తెలియదు.

భర్తపోయిన తరవాత యథావిధిగా విచారించటం తప్ప మరొకపని ఏదీ చేయవలసిన అవసరం లేకపోయింది అనసూయకు, తన గురించి పడవలసిన జాగ్రత్త అంతా తండ్రీ ఇబ్బడిగా పడడంచేత.

★

భానుమూర్తిపంతులు పెద్దకొడుకు బాగా ప్రాక్టీసు ఉన్న డాక్టరు, అతనికి డబ్బుకేమీ లోపంలేదు. కాని అతని భార్యకి మాత్రం, మామగారు ఇంత జీతం తెస్తున్నారు కదా, ఆ ఒక్క కూతురికే మీదుకట్టాలా, నెలనెలా మాకని కాదు, పోనీ మనమలకి ఏవయినా పంపకూడదా అని కడుపుడుకుగా ఉండేది. రెండవకొడుక్కి ఆమాత్రం బాధా లేదు. అతను బి.యే మూడు నాలుగుమార్లు తప్పిపోయి మానేసేడుగాని, అదృష్టవశాత్తు అతనికొక జమీందారువంటివారు మామగారు దొరికేరు. వారికి ఒకేకొడుకు, ఒకేకూతురూ కావడంవల్ల, అతను సుమారు ఇల్లరికం అల్లుడు క్రింద లెక్క. అయినా భానుమూర్తిపంతులు మాత్రం నెలనెలా యాభైరూపాయలు అతనిపేర పంపుతూ ఉండేవాడు తన దర్జాకోసం ముఖ్యంగా.

కాగా ఇక మిగిలినవారల్లా తనూ, అనసూయే, ఆమెపేర బాంకులో కొంత డిపాజిట్ చేసి తక్కినది ఏవో స్కాలర్‌షిప్పులు మొదలయిన ధర్మకార్యాల నిమిత్తం వెచ్చించాలని ఆయన తాత్పర్యం.

అల్లుడు పోయిన కొన్ని నెలలవరకూ భానుమూర్తిపంతులు బాగా కోలుకోలేదు. తను కాస్త తీరికగా మాట్లాడిన ప్రతివారితోనూ ఈ సంగతే చెప్పేవాడు. అంత తానుపడిన ప్రయత్నమే కాక తన కుమార్తె బ్రతుకే నిష్ఫలమయిందనీ, విధి విలాసము, మాయ మొదలయిన వేదాంతపు మాటలతో మిళితముచేసి ఉపన్యసిస్తూ ఉండేవాడు.

అల్లుడుపోయిన రెండేళ్లకు ఆయన రిటైరయేడు, రిటైరవడంతోనే ఆయన రిఫార్మరు (సంస్కర్త)గా మారేడు. కేవలం తన మనస్సు తనకి బోధించే బోధనే కాక తాను చేసే ప్రతిపనికి శాస్త్రీయమూ ధర్మబద్ధమూ అయిన ఆధారం ఎంత ఉందో బేరీజువేస్తేగాని, ఆచరణకి దిగలేని చాదస్తుడు భానుమూర్తిపంతులు.

ఇదివరకల్లా ఏదో తెలుగులో ఇన్ని పుస్తకాలు రాశాడు. అది ఒక పెద్ద ప్రతాపమేనా అని (అంటే పుస్తకాలు వ్రాయడంగాని, ఉపన్యాసా లివ్వడంగాని ఏ ఇతర కార్యక్రమంగాని అది పవిత్రమయిన ఇంగ్లీషులో జరిగినప్పుడే దాని ఘనత అని విశ్వసించేవాళ్ళలో భానుమూర్తిపంతులొకడు) నిరసించినా ఇప్పుడు వీరేశలింగంగారి పుస్తకాలు చదవడం ఆరంభించాడు, ముఖ్యంగా స్త్రీ పునర్వివాహాన్ని గూర్చిన ఆయన ఉపన్యాసాల మీద ఆయనకు ఎక్కడలేని భక్తి కుదిరింది. అక్కడితో ఊరుకోలేదాయన. ఏదో పరిషత్తునిమిత్తం తనపట్టణం వచ్చిన సుబ్బారాయశాస్త్రిగారిని పృచ్ఛించారు ఆయన ఏమోకూడదని వాదిస్తారు కాబోలు, తన పాండిత్యం ప్రదర్శిద్దామని. కాని,

ఆయన ఎన్నెన్నో ప్రమాణాలూ ఆధారాలు చూపించి, స్త్రీ పునర్వివాహంలో ఎటువంటి దోషమూ లేదని సిద్ధాంతీకరించేడు. ఆ వేళతో భానుమూర్తి పంతులు ఒక నిశ్చయానికి వచ్చేడు. కుమార్తెకు మళ్ళీ పెళ్ళి చేసితీరాలి. ఇక వరుడెవరని? మొదటి పెళ్ళికే మూడు సంవత్సరాలు అన్వేషించవలసి వచ్చింది. ఇప్పుడెన్నాళ్ళవుతుందో. అయితేనేం జరిగితీరవలసిందే.

మనం చిలకకి కొన్నాళ్ళు కొన్నిమాటలు నేర్పిన తరవాత ఆ మాటలు మనం మరి అనకపోయినా అదిమాత్రం ఆ మాటలే అంటూ ఉంటుంది. భానుమూర్తి పంతులు ఒకవంక పునర్వివాహ ప్రయత్నాలు సాగిస్తూఉంటే, అనసూయ 'మరెందుకు నాన్నా, నేనే సుఖపడే భాగ్యానికి నోచుకునివుంటే, ఆయనే బ్రతికి ఉండును.' అంతకంటె గొప్ప మనిషిని తేలేవుకదా ఎందుకు మరేం ప్రయత్నం చెయ్యకండి నా బ్రతుకు నిష్ఫలమైపోయింది' అనేది.

మనం నేర్పినమాటలే చిలక అంటున్నా అవి వింతగానే వినిపిస్తాయి. అలాగే మనవద్దనుండి గ్రహించిన అభిప్రాయాలనే ఎదుటిమనిషి సొంతమాటలతో అనేసరికల్లా కొత్తగా వినిపించక మానవు. కుమార్తె ఇలా అన్నందుకు భానుమూర్తి పంతులు ఆమెయొక్క ఉన్నత భావాలకీ ఆదర్శ పతిభక్తికీ (అవన్నీ ఆమెలో గూడుకట్టుకొని ఉన్నాయని అతని విశ్వాసము) అమితంగా మెచ్చుకొన్నాడు, కాని తనుచేసే ప్రయత్నాలు మాత్రం మానలేదు. వాటిలో తోడుపడవలసిన పాటి అనసూయకూడా తోడుపడకపోలేదు.

ప్రయత్నాలు ఒక రకంగానే కాదు అన్ని రకాలుగానూ జరిగేయి.

వార్తాపత్రికలలో అతిఆకర్షణీయంగా ప్రచురించేరు. ప్రతిదరఖాస్తుదారునీ, అతడి దరఖాస్తువల్లనే అతడు తమ సంబంధానికి అర్హుడని రూఢిపడిపోతున్నా రానూపోనూ స్వంతఖర్చులు చేసుకొని. వ్యక్తిగతంగా పరీక్ష సాగించేవారు.

మధ్యవర్తులను నెలజీతగాళ్ళని పోషించినట్లు పోషించేరు. ఇంకాకొన్ని ముఖ్యమయిన ప్రదేశాలకు స్వయంగా వెళ్ళి ప్రాధేయపడడం జరిగింది.

---

ందవాణి *

భానుమూర్తిపంతులు ప్రయత్నలోపం చేసేడని పగవాడయినా అనలేడు. అంతటి సార్థకమయిన (అంటే డబ్బుతో కూడిన) మానుష ప్రయత్నంచేసికూడా ఆయన కృతకృత్యుడు కాలేదంటే, అందుకు గ్రహాలు కలిసిరాలేదనో, విధినిర్ణయం అన్యథా ఉందనో ఏదో మానవశక్తికి అతీతమయిన కారణం చెప్పకుంటే కాస్త సంతృప్తిగా ఉంటుంది.

సుమారు నాలుగు సంవత్సరాలు ప్రయత్నించి ప్రయత్నించి ఆయన విసిగివేసారిపోయేడు. తనకూ అమ్మాయికీ నూటికి తొంభైవంతులు వరులు (అంటే పెళ్ళికావలసిన యువకులు) అప్రయోజకులుగానూ, అసమర్థులుగానూ, దీనులుగానూ, హీనులుగానూ రూపించేరు. ఇక ఏకొద్దిమందో నచ్చినవాళ్ళంటే వాళ్ళకు రెండవపెళ్ళి అనే అభ్యంతరం ఉండడమో, అత్యంతమూ సన్నిహితమయిన సంబంధాలుండడమో జరిగేది. క్రమంగా అనసూయకు పునర్వివాహం చేయాలన్న భానుమూర్తిపంతులు ఆశ వెన్నెలరాకతో అంతరించే శారదనీరదాల్లా అంతరించింది.

'అమ్మా! ఎన్నాళ్ళీ విధవ అద్దెఇళ్ళలో బాధపడతావమ్మా, ఏటికి దగ్గర్లో ఒక పెద్దమేడ చవగ్గా వచ్చేట్టుంది. నీపేరుని కొందామని చూస్తున్నాను' అన్నాడు భానుమూర్తి పంతులు.

'అలాగే కొనండి నాన్నా, కాని నాపేరున ఎందుకు మీపేరునే ఉండనీయండి'—అంది అనసూయ.

'అలా కాదమ్మా, నేనేమో బాగా ముసలివాణ్ణయిపోతున్నాను. నీపేరునే ఉంటే మరే తగాదాలూ తరవాత ఉండవు. భూములమీద నుండి నీకు వసూలు కావడమన్నా కష్టమే. అంచేత అంతానగదుకిందమార్చి నీపేర బ్యాంకులో కొంత ఉంచాలని చూస్తున్నాను ఏమంటావు.'

'నాతో చెప్పేదేమిటి నాన్నా మీకెలా బాగుంటుందని తోస్తే అలా చెయ్యండి.'

విశాలమయిన పెద్ద ఇల్లు. ఇంటికి చుట్టూ ఒక్కవేపు తప్ప మొక్కలతోనూ చెట్లతోనూ నిండి చిన్న తోటలా ఉంది. తోటను ఒరసికొని పారుతున్నది ఏరు.

ఇల్లు ప్రశాంతంగా భగవద్గీతపారాయణ చేసుకుందికి భానుమూర్తి పంతులుకి బాగుంది. ఒంటరిగా డాబామీద కూర్చొని శూన్యదృక్కులతో

ఏటివంక చూస్తూ విచారించడానికి అనసూయకి బాగుంది.

ఇల్లు కొన్న వారంరోజులకే అందులో ప్రవేశించేరు.

మనుష్యులను సామాన్యంగా గడిచిపోతూ, చేయకతప్పని పని ఏదీ లేనప్పుడు ఆలోచన మిక్కిలి విజృంభిస్తుంది. ఇంటిపనిగురించి ఏమీ తాపత్రయం అవసరం లేకపోయింది అనసూయకి. అరవైయేళ్లు పైబడినా నలభైయేళ్ళ మనిషికంటె ఎక్కువ ఓపికతో ఉత్సాహంతో పనిచేసేది సీతారామమ్మ. కొత్తవాళ్ళకి ఆమె కుటుంబంలోని మనిషిగానే రూపిస్తుంది. ఆమెకు నా అన్నవాళ్లెవళ్ళూ లేకపోవడంవల్ల నెలనెలా ఇయ్యవలసిన జీతంకూడా భానుమూర్తిపంతులువద్దనే కూడేది. ఆ డబ్బు ఇప్పటికి ఎంతయిందో ఎవరికీ తెలీదు. ఆమె అతి పొందికగా దమ్మిడీ వృథావ్యయం కాకుండా సంసారం నిర్వహించుకొని వచ్చేది. ఇక, అనసూయ చేయవలసిన పనల్లా కాఫీలు ఫలహారాలు చూసుకోవడమూ, బజారునుంచి కావలసినవస్తువులు పద్దురాయడమూ ఇటువంటివే. ఇటువంటివాటికి రోజంతటిలోనూ ఎంత సమయం పడుతుంది గనుక.

అలా ప్రతిరాత్రీ ఆ చదివిన పుస్తకాలే (అవి ఎంత గొప్పవని తను నమ్మితేనో) మళ్ళామళ్ళా ఎంతకని చదవడం, మేడమీద వరండాలో ఏటివంకతిరిగి అనంతంగా ఏమిటలా ఆలోచించేదో, ఊహించడం కష్టం; బహుశః తన్ని తన నిష్ఫల జీవితాన్నిగూర్చి ఆలోచిస్తూ ఉంటుందేమో. దూరంనుండిచూస్తే ఏరెప్పుడూ ఒక్కలాగే ఉంటుంది, దానిలోని నీరు నిత్యమూ ప్రవహిస్తూ మారిపోతూనే ఉన్నా, అలాగే మనుష్యుల ఆలోచనలున్నూ. అవి ఎవరికివారికి ఎప్పటికప్పుడు క్రొత్తగానే ఉన్నట్టుంటాయి.

అనసూయకి పుస్తకాలయెడల ఆసక్తి తగ్గిపోవడానికి అవి పాతబడడం ఒక్కటే కారణం కాదు, అనతిదూరంనుండి వినవచ్చే ప్రశాంత గంభీరమయిన వీణానినాదముకూడా ఒక కారణం. రానురాను అదే ప్రబలమయి తక్కినవి అప్రధానములయిపోయేయి.

పొరుగిల్లు అని చెప్పుకుందికి వీలుగా ఉన్నది ఒక్కటే ఉన్నా ఆ యింటివారినిగూర్చి అణుమాత్రమూ తెలుసుకోనంత సబబుగా ఉంది అనసూయ పరిస్థితి. అయితే ఆ పొరుగువారిది అంతకంటెకూడా సబబయిన స్వభావమేమో! వాళ్ళ గురించి తెలుసుకుందికి ఏమీ ప్రయత్నించినట్టు లేదు.

అప్పుడప్పుడూ రాత్రి అనసూయ సంగీతము వింటూ మధ్యమధ్యనే అనుకునేది, దానికి కారకులయినవారినిగూర్చి తెలుసుకోవాలనుకొనేది. కాని ఆ సంకల్పము అంతతోనే సరి.

క్రమంగా ఆమెకు ఆ సంగీతం అదొక మత్తుమందులా అలవాటయిపోయింది. అదేగాని వినబడకపోతే ఏమో వెలితిగా ఉండేది, నిద్రపట్టేది కాదు. అవతలివాళ్ళకీ అలాగే ఉండేదికాబోలు, ఒక్కొక్కనాడు రాత్రి ఏ ఒంటిగంటకో వీణ శ్రుతులు సరిచేస్తున్న ధ్వని వినిపించేది. అలాటి రోజుల్లో అనసూయకు పెద్దపండుగన్నమాటే, తెల్లవార్లూ నిశ్చింతగా వినవచ్చును.

★

ఆవేళ ఉదయం బజారునుంచి కావలసిన వస్తువులు పద్దురాసి బంట్రోతుచేతికిస్తూ ఉండగా సుమారు తన వయస్సుకలిగిన ఒక అమ్మాయి అపరిచిత వచ్చింది. ఆ ఒక్కరోజులోనే ఆ అమ్మాయి ఎంతో ఆప్తురాలయిపోయింది అనసూయకి.

కొద్దిరోజుల్లో ఆ అమ్మాయీ అనసూయా ఒకటే శరీరం అన్నట్టుగా ఐపోయేరు, భగవద్గీతా పారాయణ చేసుకొంటూనే భానుమూర్తిపంతులు పోనీ అమ్మాయికి ఈమాత్రం సత్సహవాసం దొరికింది అదెంతకాదు ఈ ఊరి చివరి ఇంట్లో ఈ మూలంగానయినా ఆమె జీవితంలో కాస్త ఉల్లాసం కలుగవచ్చు ననుకొని తృప్తిపడ్డాడు.

ఆయన ఆశించినట్టుగా అనసూయలో ఉల్లాసం కలగడమే కాదు, ఒకనాడంతటది స్వయంగా తానే తన ఉద్వాహప్రసంగం తెచ్చింది. ప్రసంగం కేవలం తండ్రికి తెలియజేయడానికే తప్ప, ఆమె ఏదో అదివరకే నిశ్చయం చేసుకొన్నట్టుగా ఉంది ఆమె ధోరణి.

ఆమె చెప్పింది. అంతా విని భానుమూర్తిపంతులు పెద్దగా ఏదో భారంతీరినట్టుగా నిట్టూర్చి, "నీ యిష్టానికి నేను అడ్డుచెప్పుతానా తల్లీ; నిన్ను గొప్పదాన్నిచేసి హిమవత్పర్వతశృంగంమీద కూర్చోబెట్టాలని సకల ప్రయత్నాలూ చేసేను. చివరికి నా సర్వస్వం వెచ్చించి అయినాసరే నీకు పునర్వివాహం చెయ్యాలనుకున్నాను. 'కర్మణ్యే

వాధికారస్తే మాఫలేషు కదాచన' అనికదా కృష్ణ భగవానుడన్నాడు అని అత్యంతసాధువుగా అన్నాడు.

'నిజమే, నాన్నా మీరు చెప్పేది. నేనూ మీతోపాటు ఈ ఆశ ఇదివరకు విడిచిపెట్టేసున్నదాన్నే. కాని ఇప్పుడేమో నా అంతరాత్మ నన్ను ప్రేరేపిస్తున్నది. సేవాభాగ్యంలోనే నా జన్మకి సాఫల్యం ఉందని ఎవరో చెప్తున్నట్టుంది' అంది అనసూయ.

—'అయితే కానీ అమ్మా, కాని, నాకేమో నిజం తెలియదు. అప్పుడే ఇల్లు కొనేటప్పుడు ఎవళ్ళో అన్నారు, అతడికి దృష్టి చాలా చెడిపోయిందని. చెడిపోయిందనేమిటి, అసలు కళ్ళే కనబడవని, మనిషేమో బహు ఉత్తముడేనట గాని'

ఈ మాటతో అనసూయలో వచ్చిన ఉద్వేగము వర్ణనాతీతము. ఆ మాటలు అన్న మనిషి తనకు అత్యంతమూ పూజ్యుడయిన తండ్రి కాక, మరెవ్వరయినా అయివుంటే ఆమె మహిషాసుర మర్దని అయివుండును.

ఎల్లాగో తనను సంబాళించుకొని—

'అనకేం. అంటుంది, గ్రుడ్డిలో కానికి అందరినీ గ్రుడ్డివాళ్ళని అనడమే పని. ఈ దరిద్ర అంధ జగత్తును చూస్తూ ఉండేకంటె నిజంగా కళ్ళు మూసుకోవడం ఎన్నోరెట్లు మేలు—' అంది వణకిపోతూ.

కొంతసేపు తండ్రీకూతుళ్లు నీరసంగా కూర్చొని భోజనానికి లేచేరు.

★

చంద్రమౌళి చదివేది ఇంగ్లీషు చదువయినా అతడి ప్రతిభ అంతా సంగీతంలోనే. సహజమధురమయిన కంఠధ్వని, ఆకర్షణీయమయిన రూపము అతణ్ణి అందరికీ ప్రేమాస్పదుణ్ణి చేసేవి

అతనికి మామూలు తెలివితేటలకేం లోపం లేదు కాని, వయసువస్తున్నకొద్దీ కళ్లకు పటిమ తగ్గసాగింది. ఇంటర్మీడియేటు వేళకి కొంత చదవగలిగేవాడు, బి.ఏ పరీక్షకు అతడు చదివేదానికంటె స్నేహితులు చదవగా విన్నదే ఎక్కువ. పరీక్షలకి మాత్రం ఎలా వ్రాసాడో భగవంతుడికే తెలియాలి. అతడు తీర్ణుడయ్యేడు.

ఏమి దురదృష్టమో వందలకొద్దీ రకాలమందులు వేలకొద్దీ ఖర్చుపెట్టి ఉపయోగించినా అతడి దృష్టి నయంకాలేదు. అలాగని ఒక్కరోజులో పోనూ లేదు, క్రమంగా తగ్గసాగింది.

బి.ఏ. పాసయినతర్వాత ఇప్పటికి సుమారు పదేళ్లు కావస్తున్నా—ఏమీ చదవలేదు, వ్రాయలేదు—ఆ అవసరమే కలిగినట్లు తోచలేదతనికి.

లక్షలతో వ్యాపారంచేసి చివరికి దివాలాతీసిన అతని తండ్రి అతనికి చేసిన ఉపకారం ఒక్కటే. అప్పటికి తామున్న పెద్దమేడా దానిని అంటి ఉన్న చిన్న పెంకుటిల్లూ బేంకులో ఒక పదివేల రొక్కమూ అతనికి ఏదోవిధంగా మిగిల్చి మరీ ఆత్మహత్య చేసుకొన్నాడు.

ఆస్తి ఏమీ లేకపోయినా, పూర్వపు అలవాట్లెక్కడికి పోతాయి. బేంకులోని డబ్బు ఏడాదిలో చాలా తరిగిపోయింది. మిగిలింది కాస్తా చెల్లెలు ఇందిర ఎంత వద్దంటున్నా ఆమె పెళ్ళికింద ఖర్చుపెట్టేసేడు.

“మరి నీకెలాగన్నయ్యా” అనేది ఇందిర.

“నాకేముందమ్మా, నువ్వు అత్తవారింటికి వెళ్లిపోతే నాకింత పెద్ద ఇల్లెందుకు, నేను మన చిన్న ఇంటిలోకి వెళ్ళిపోయి ఇది అమ్మేస్తాను. ఆ డబ్బు ఒక కొన్ని సంవత్సరాలు రాకపోదు. ఆ తరువాత ఇంకా అంత అవసరంపడితే నా వీణ ఒక ఒడ్డు కాయదా” అన్నాడు.

“ఒంటరిగా నిన్ను చూసేవాళ్లెవళ్లూ లేకుండా నేను హాయిగా వెళ్ళిపోనా అన్నయ్యా” అంది చెల్లెలు ఇందిర. ఎలాగయితేనేం వెళ్లింది అన్నయ్య బలవంతంమీద.

బేంకులో డబ్బు అయిపోవస్తున్నది, ఇక ఇల్లు ఎవరయినా కొంటే బాగుండునని చంద్రమౌళి చూస్తున్న సమయంలో మరొక విపత్తు వచ్చిపడ్డాది. తండ్రి ఎంత జాగ్రత్తగా అప్పులన్నీ తీర్చినా, ఆయనకు స్నేహితుణ్ణనుకునే పెద్దమనిషి కొన్ని పాతకాగితాలు తెచ్చి చాలాసేపు డొంక తిరుగుడుగా అప్రస్తుతంగా మాట్లాడి మాట్లాడి “వీటినేమంటావు నాకేమీ దావా చెయ్యడం ఇష్టం ఉండదుకదా నువ్వు ప్రాజ్ఞుడివి” అన్నాడు.

అతనితో తగాదాపడడానికి ఇష్టమూ శక్తీ లేక 'ఎలాగూ మీ పేరునెకదా తాకట్టుకి ఉంది,

పోనీ మీరే క్రయానికి తీసుకోండి, ధర్మమయిన విలువ నిర్ణయించి' అన్నాడు చంద్రమౌళి.

అతడికి బజారునడిమిని తప్ప ఇల్లు ఇష్టంలేదు. అందుచేత ఈ బేరాన్ని భానుమూర్తిపంతులుకి లాభసాటిగా ఏర్పాటుచేసేడు.

బేంకులో డబ్బు సుమారు ఆఖరవుతున్న రోజుల్లో ఒక రెండువేలు కూడేయి చంద్రమౌళికి. పెద్ద మేడ పోతేనేం. ప్రక్కనున్న పెంకుటింటికి తన ఏకైక రక్షకుడు మిత్రుడు సేవకుడయిన వెంకటేశంతోసహా నిష్క్రమించేడు.

ఆరు నెల్లలో తిరిగివచ్చే వేళకు ఇందిరకు ఇల్లు ఇలా అయిపోయిందని తెలీదు. చనువుగా స్వతంత్రంగా ఇంట్లో ప్రవేశించి అప్పుడు గ్రహించింది.

ఆమెతో అనసూయకు కలిగిన స్నేహానికి ఫలితమే అనసూయా చంద్రమౌళుల ప్రణయం.

ఒక శుభదివసాన అతి నిరాడంబరంగా వివాహకాండ జరిగిపోయింది.

మళ్లీ చంద్రమౌళి తన మేడకు వచ్చేసేడు కొత్తహోదాలో. ఇదివరకు అతనికి అన్నీ అయి అహర్నిశలూ అతన్ని కనిపెట్టుకొనివుండే వెంకటేశానికి ఇప్పుడట్టే పని కనబడడంలేదు. బాబుగారికి కావలసిన సర్వమూ అమ్మగారే స్వయంగా చేసుకొనేది.

భానుమూర్తిపంతులు అనుకొన్నాడు: అతడు గ్రుడ్డివాడయితేనేమి, కుంటివాడయితేనేమి. అమ్మాయి ఆనందపడడమేకదా నాకు కావలసినది. ఆమెకు ఈ విధమయిన సేవలో సుఖించే రేఖ ఉందికాబోలు' అని.

ఏ సంగీతాన్నయితే మధురాతిమధురంగా ఆస్వాదించి జీవితంకంటెకూడా ఎక్కువగా భావించుకొని పెళ్ళిచేసుకొందో ఆ సంగీతంలోని అతిలోకమయిన అనుభూతిమాత్రం అందటంలేదు, అనసూయకి. కాని చంద్రమౌళికిమాత్రం తానూ చిన్నతనంలో స్వర్గమంటే ఇంత గొప్పగా ఊహించి ఉంటాడా అని అనుమానం కలుగుతూ ఉండేది.

★

వసంతఋతువులో ఎక్కడికక్కడ లతలు కొనలుసాగి ననలెత్తి, పరిమళిస్తూఉంటే, ఈ వివిధ వర్ణశోభ, ఈ మధుర సౌరభప్రభ ఇలా కొనసాగిపోవలసినవే కాబోలు నన్నంత ఆశగా ఉంటుంది. కాని ఆ ఆశలు అట్టేకాలం నిలవకుండానే ఋతువులు మారిపోతాయి.

అనసూయజీవితం అంతా ఇక కలతలేని రాచబాటగా నిరూపించింది. ఇదివరకు తనకు తానే అన్నట్లుగా కాలక్షేపం చేసినప్పుడు ఎంతకీ గడవని ఇరవై నాలుగుగంటలు ఇరవై నాలుగు నిమిషాలుగా గడిచిపోతున్నాయి పతిసేవాపరత్వంలో... అంతా బాగానే జరిగి ఉండును.

★

ఒకనాడు ముందుగా ఏ వార్తాలేకుండా చిన్నన్నయ్య గోపాలం సకుటుంబంగా వచ్చిపడ్డాడు.

భానుమూర్తిపంతులు అట్టే మాట్లాడలేదు. అనసూయ ఆదృతి స్వరూపిణి అయింది.

అన్నయ్యకొడుకు మోహనుడు, కూతురు ప్రేమవల్ల అనసూయకు పిల్లలు లేనిలోటు మరి కనిపించలేదు. అన్నయ్యా, వదినాకూడా ఎవరి పిల్లలో అన్నట్లుగా నిశ్చింతగా ఉండేవారు.

ఇంటికి చక్రవర్తిని అనసూయ, ఆమె కనుసన్నలను మెలగే సామంతప్రభువులు అన్నయ్యా, వదినాను.

అన్నయ్యకు బజారుపనిలో బేరసారాలు తెలియవని తప్పుపట్టడానికిగాని, వదినను ఇంటిపనిలోనే కాదు, పిల్లల సంరక్షణలోకూడా చేతకానిదని, అపసంతిదనీ అనడానికి ఆమెకు హక్కుండేది. ఆమె నియంతృత్వానికి ఎదురునిలిచేమాట ఇంటిలో ఎవరిదీ లేదు.

వదినకు అనసూయ అంటే మింగేద్దామని ఉండే ఆగ్రహం లోపల్లోపలే అణిగివుండడంవల్ల మరింత దుర్భరంగా ఉండేది.

ఆమె అన్నదమ్ముడు, అంతఆస్తినీ అయినవారు సంవత్సరాలలో కరారావుడు చుట్టిన మనిషి ఒకనాడు వచ్చేడు.

మొదట అనసూయ అతనికి ఒకమహారాజుకి జరిపినట్లుగా మర్యాదచేసింది. చివ్వరికి రాత్రి అతని ప్రవర్తనలో అతని నిజమయిన వ్యక్తి బైటపడ్డాడు. 'బంట్రోతును పిలిచి తగిలెయ్యమంటావా, అవతలికి నడుస్తావా' అని స్వయంగా అవతలికి తరిమివేసింది.

ఈ గొల్లంతులో 'ఎవరయినా దొంగవచ్చేడా?' అని కలతనిద్రలో అడిగిన భానుమూర్తి

పంతులుతో, ఆమె ఇంగ్లీషున 'నేనేమో తగుమని అనుకొన్నాను; పచ్చితాగుబోతని నాకు తెలియలేదు' అంది.

ఎవరినీ ఏమిటి అని అడగకుండానే అక్కడికంతా తెలుసుకున్నవాడిలాగే భానుమూర్తిపంతులు 'ఆహా తగిలీసేవా, మంచిపని చేసేవు' అని ఆటునించిటు ఒత్తిగిల్లి పడుకున్నాడు.

గోపాలానికి బావమరిది యడల తాన తవారింటిలో ఉండేటప్పటికోసం ఈ విధంగా తీరడం బాగానే ఉందనిపించింది కాని, భార్య తనను ఇటువంటి సమయంలో కూడా తనపక్షం కాయాని విశ్వాసహీనుడుగా భావిస్తుందేమోనని భయం. అన్నివాళ్ళుగా అణగిఉన్న వదిన స్వభావం ఆవేళతో తెరమరుగు తొలగించుకొంది. నాకు మాత్రం హక్కులేదా, నన్నెవరేం చెయ్యగలరు, నా చేతిలో డబ్బులేకపోయినా నేనూ కాయిష్టం వచ్చినట్లు మాట్లాడానికి అపైవాళ్ళెవరు' అన్న ధీమాతో ఆమె ఒక్కమారుగా విప్లవం లేవదీసింది ఇంట్లో.

తనమాట అందరూ శిరసావహించినప్పుడు అధికారం చెయ్యడమే వచ్చునుగాని, క్రిందివాళ్ళు తిరగబడినప్పుడు వారిని అణచివేసే చాకచక్యము అనసూయలో శూన్యము. కాగా ఇంట్లో నిత్యసంగ్రామము ప్రతిస్వల్పవిషయానికిన్ని అనసూయ. పెద్ద ఎక్కువ చనవుగా ఉంటున్నారు కదా అని మూర్ఖంగా, ఆఖరికి గోపాలం చెప్పినా వినకుండా పిల్లలను తాత గారింటికి పంపివేసింది. ఇలాగే ప్రతివిషయంలోనూ.

ఈ రకం తగాదాలతోనూ, ఇంటిలోనిమనిషి కంటె ఎక్కువగా ఉండే సీతారామమ్మగారు పోవడంతోనూ, కొత్తవంటమనుషుల పేచీలతోనూ గోపాలంకూడా నాకే విషయంలోనూ పూచీలేదన్నట్టు తయారవడంతోనూ, అనసూయకు క్షణకాలమయినా తీరుబాటుండేది కాదు. తండ్రికీ, భర్తకు తాను ప్రత్యేకించి చేసే సేవకు మునపటివలె వీలుచిక్కేది కాదు.

అనసూయకు తనవద్ద ఉండడానికి ఎంతగా వీలు చిక్కకపోతే, చంద్రమౌళికి అంతగా మళ్లీ సంగీతముమీద మమత ఎక్కువయినట్లుండేది.

ఒకొక్కనాడు, "నేను వచ్చేనని మానీసేరేమి వాద్యం' అనేది అనసూయ, 'లేదులేదు అంతకంటె ప్రియతమమయినదానివి నువ్వు' అనేవాడు చంద్రమౌళి.

రానురాను ఇంట్లో అలజడి ఎక్కువ కాసాగింది.

★

చంద్రమౌళిదృష్టి మరీమరీ మందం కాసాగింది. ఏదో అలవాటయిన భాగంలో సంచరించటం తప్ప ఎటు తిరగడము అసాధ్యంగానే ఉండేది. ఎప్పుడయినా ఒకనాడు మాత్రం చీకటిపడుతూ ఉండగా బంట్రోతును ముందు పెట్టుకొని ఏటి ఒడ్డున షికారు తిరిగివచ్చేవాడు.

అందరికీ తెలిసినా చంద్రమౌళి దృష్టిగురించి తాను గుంభనగానే ఉంచినట్లు అనసూయ చాలా కాలం తనను తాను వంచించుకున్నది.

అనవసరంగా సందర్భం కల్పించుకొని, ఆయన రాత్రి ఒంటిగంటదాకా అలా చదువుతూనే కూర్చున్నారనీ, అప్పుడయినా తాను దీపం ఆర్పితేనే నిద్రపోయారనీ అనేది.

ఒకొక్కప్పుడు 'ఒంటరిగా ఉన్నారంటే సరి, ఏవో అలా వ్రాస్తూనే ఉంటారు. హాయిగా విశ్రాంతిగా పడుకోరు. ఎక్కడి స్నేహితులో ఎప్పుడూ ఉత్తరాలే' అనేది,—ఆ స్నేహితులు గగనారవిందాలవలె ఎవరికీ కనిపించకపోవడమే కాదు, వారు వ్రాసిన ఒక్క ఉత్తరమయినా ఎన్నడూ అందజేయవలసిన అవసరం పోస్టుమేన్‌కి పట్టేదికాదు. ఇదీ కొంత కొంతగా అలవాటుమీద ఇంటిలో సంచరించగలిగిన రోజుల్లోని ఆమె ధోరణి.

ఇటీవల ఎక్కువగా చదవడంవల్ల కళ్ళకీ జబ్బుచేసిందనీ, అదైనా అట్టే ప్రమాదమయినది కాదనీ కాస్త కళ్ళు కడిగించుకొని (తోమించుకొని) కళ్ళజోడు పెట్టుకుంటే సరిపోతుందనీ అనసాగింది.

భానుమూర్తి పంతులు భగవద్గీత పారాయణం నడుమ కూతురు మాటలు విని తనలోతాననుకొనేవాడు. 'ప్రేమ గుడ్డిది-అంటే ఇదేకాబోలు, లోకాన్నే గుడ్డిదాన్ని చెయ్యాలని ప్రయత్నం-అనుకొని మళ్ళీ-నైనంఛిందంతి శస్త్రాణి నైనం దహతిపావక-అని అందుకొనేవాడు.

ఇంకా ఇతరులని సాధ్యమయినంతవరకూ మధ్య పరచవలెనన్నే తాపత్రయం తప్ప అనసూయకు స్వయంగా చంద్రమౌళి దృష్టిని గురించిన దురాశ ఏమీ లేదు-ఆ ఆశ చంద్రమౌళికి అంతరించి పదేళ్ళపైగా అయింది.

ఆమె భర్త కంటివైద్యానికని బయలుదేరిందంటే, అందుకు అతని దృష్టి బాగుపడుతుందన్నే ఆశకంటె ఇంట్లో అనుదినమూ అభివృద్ధి అయే అలజడినుండి అతన్ని తప్పించి, అహోరజనులు అతని సమీపంలో కూర్చొని కావలసిన సేవ చేయాలన్న తాత్పర్యమే ప్రధానమయినది.

అయినా ఎవరికో బుజువు కావాలన్నట్లుగా పట్నం వెళ్ళగానే, అనవసరమని పూర్తిగా తెలుస్తూన్నా హాస్పిటలుకు తీసుకొని వెళ్ళింది కారుమీద భర్తను.

వాళ్ళు మరి రానక్కరలేదని చెప్పివేసినా, ఏమో అవసరం ఉన్నట్లు నిత్యం హాస్పిటలు నుండి మందు తెప్పిస్తున్నట్లు నటించేది-ఆమె నటన కాలక్రమేపీ చంద్రమౌళికికూడా అలవడింది. 'పూర్వంకంటె ఇప్పుడు చాలానయంగా ఉన్నట్టుంది సుమా మరొక్క రెణ్ణెల్లలో పుస్తకం కూడా చదవవచ్చునను కొంటాను'-అనేవాడు.

నెలనెలా ఆమెదగ్గరనుండి ఉత్తరం రాక మునుపే మనియార్డరు సవ్యంగా వచ్చేది.

అంతా బాగానే జరిగిఉండును కాని ఒక్కొక్కనాడు రాత్రి చంద్రమౌళికి ఒంటరిగా తోచి నిద్రపట్టక 'అనూ, అనూ' అని పిలిస్తే దగ్గరలోనే ఉండికూడా ఎంతోదూరంనుంచి రావలసినంత వ్యవధి పట్టేది కళ్ళుతుడుచుకొని, నవ్వు తెచ్చుకొని సమీపించడానికి.

ఏడుస్తున్నావా అని అడగలేక, "ఏదీ నావీణ ఒకసారి ఇల్లా ఇస్తావా?" అని అడిగేవాడు.

ఆ నెల ఏమో మనియార్డరు రాలేదు. అన్నీ అశుభసూచనలే కనిపించసాగాయి అనసూయకి.

ప్రొద్దుటి టపాలో ఉత్తరం రాసిపడేసింది. 'ఆయనదృష్టి చాలావరకు బాగుపడినట్టే, ఇక ఇంటికి వెళ్ళిపోయి మందు స్వయంగా వేసుకో వచ్చునని డాక్టర్లన్నారని.

ఆ సాయంత్రమే కార్డువచ్చింది. "నాన్నగారు మూడు రోజుల క్రితం స్వర్గస్థులైరని తెలుపుటకు

# ఆనందవాణి

## పోస్టుబాక్సు నెంబరు

## 1583

చందాదారులు, వ్యాసకర్తలు, ఏజెంట్లు తాము ఆనందవాణికివ్రాసే ఉత్తరాల చిరునామాలో పై నెంబరును తప్పక ఉదాహరించవలెను. లేనిచో మాకు ఆ జాబులు చేరడంలో ఆలస్యం జరగవచ్చు.

—మేనేజరు

విచారిస్తున్నాను. ఈ వార్త పేపర్లలోకూడా వేయించడమైనది" అని గోపాలం వ్రాసిన ఉత్తరం వచ్చింది.

ఆవేళ ఆమె దుఃఖానికి ఆనకట్ట తెగిపోయింది.

గోపాలం ఉత్తరంలో తనను రావలసిందని లేకపోయినా మర్నాటి మెయిలులో భర్తతో సహా బయలుదేరింది-

ఇంటికి వెళ్ళేసరికి పెద్దఅన్నయ్య కుటుంబముకూడా వచ్చిఉంది.

ఇల్లు విచారసూచకంగా లేకపోవడమే కాదు, పెళ్ళివారిల్లులా విలాసలాలస ఉన్నట్టుంది.

తానొకనాడు త్రాగుబోతని అవమానించి బైటికి నెట్టివేసిన మనిషికూడా ఉన్నాడు. అందరిలోనూ అతడొక్కడే కాస్త విషాదస్వరంతో పలకరించినవాడు.

ఆమెకు పరిస్థితి కొంత అర్థమయింది.

వెంటనే ఒంటరిగా ఆ ఎండలో ముకుంద రావుగారింటికి బయలుదేరింది. భానుమూర్తి పంతులు భగవద్గీతలో నిమగ్నుడయిన నాటినుండి

తన తరఫున వ్యవహారాలన్నీ ఆయన చేతిమీదుగా నడిపేవాడు. అతడికి మొదటినించీ తనంటే ప్రసన్నభావం లేదు. తండ్రి ఆస్తి కూతురికి కొంతయినా సంక్రమించటం బహుదురన్యాయమని అతని సిద్ధాంతం. ఉంటాడో ఉండడో అనుకుంటూనే మెట్లెక్కింది.

తన నతడు ఓదార్చటం కాదు, అతనినే తను ఓదార్చవలసినట్లయింది. చివరికి లావయితేనేం గంటున్నర డొంకతిరుగుడుతో కక్కేసేడు విషాదవార్త మీద విషాదవార్త.

కొంతసేపు స్తంభించిపోయినట్లుగా కూర్చొని 'అయితే, ఆయన చివరికి నాపేర ఒక దమ్మిడి కూడా ప్రత్యేకించ లేదన్నమాట' అని తడబడుతూ అని లేచి నిలబడింది.

మాటలు నములుతూ 'అంతేనమ్మా. మరి నేనే కదూ, విల్లు రాశాను. అందులో నీ ప్రసక్తే రాలేదు.' అన్నాడు ముకుందరావు.

ఆ ప్రసక్తి రాకపోవడానికి విల్లు భానుమూర్తిపంతులు బ్రతికి ఉండగా కాక చనిపోయినప్పుడు వ్రాయబడడమే. స్మృతి తప్పిపోయే ముందు సంతకాలు పెట్టిన (ముకుందరావుమీద నమ్మకంచేత) కాగితాలమీద ఆయన అనంతరం తీరికగా విల్లు వ్రాయబడింది. మునపటి విల్లులోని ధర్మఖర్చులు, అనసూయభాగం విడిచిపెట్టబడి ఆస్తి రెండువంతులు గోపాలానికి ఒకవంతు పెద్ద అన్నదమ్ముడికి విభాగించబడింది. ముకుందరావు పంతులుగారికి కూడా గోపాలం ఒక పదివేలతో కృతజ్ఞత చూపించుకొన్నాడు.

అనసూయకు డబ్బును ఉపయోగించుకోవడం తప్ప, ఎన్నెన్ని పనులయినా చేయించగల దాని మాహాత్మ్యం తెలీదు.

వంటిమీద స్పృహ లేకుండానే ఇంటికి వెళ్ళింది. వెళ్ళేసరికి భర్త వీణావాద్యాన్ని త్రాగుబోతు మహాశయుడు వింటూ భేష్ భేష్ అంటున్నాడు. కళ్ళు తిరుగుతున్నట్లుంటే సమీపంలో కుర్చీపట్టుకొని నిలబడింది. అంతలో లోనుండి 'ఏమిటన్నయ్యా, ఇవతల టిఫిను చల్లారిపోతూ ఉంటే (ఒకింత తక్కువ గొంతుతో) ఆ గుడ్డివెధవ సంగీతాన్ని వింటూ కూర్చుంటావు?' అన్న మందలింపు వినవచ్చింది.

సంగీతమూ గ్రుడ్డిదీనా అనుకుంటూ, తూలిపోతూనే వెళ్ళి వీణతీగ తెంపేసింది. సులువుగా చేతిలోకి వచ్చేమాటయితే వీణకూడా వెయ్యి చక్కలలయేలా విసరకొట్టునేమో!

ఆ సాయంకాలం ఆమె ఎవరికీ కనబడకుండా ఒక గదిలో తలుపు గడియ వేసుకొని కూర్చొంది. రాత్రి పదకొండు గంటలప్పుడు, వెంకటేశాన్ని వేరుగా పిలిచి, పెట్టెతాళం పోయింది, అందాకా ఈ మాట నీ మొలకి కట్టుకో, జాగ్రత్త' అని బరువయిన ఒక మాట ఇచ్చింది. 'అలాగేనమ్మా' అన్నాడు నిద్రమత్తు ఇంకా బాగా వదలని వెంకటేశం.

ఆ రాత్రితో ఆమె నిష్ఫలజీవితాన్ని సాంతం చేసింది ఒడ్డును ఒరసిపారుతున్న పూర్ణవాహిని.

శవంకోసం విశేషం ప్రయత్నాలు జరగలేదు.

చంద్రమౌళి ఒకరు చెప్పనక్కర లేకుండానే వెంకటేశం సహాయంతో సాగుతూనే ఉన్న తన పాడుగోడల ఇంటిలో గృహప్రవేశం చేసేడు.

ఇందిరకీ సంగతి ఎలా తెలియడం అనుకొంటూ ఉండగా ఆమె వచ్చింది. ఆమెకీ తెలుసును. చనిపోయేముందు, ఆమెకి ఉత్తరం రాసిస్వయంగా పోస్టుచేసింది అనసూయ. 'వదినా నేను హృదయపూర్వకంగా చేయాలనుకొన్న సేవకి మూలాధారమయినది ఏదో నాకు అందకుండా పోయింది. ఉద్యోగం చేయలేకపోనుగాని, ఈ అవమానంతో మరి బ్రతకాలని లేదు. మొదటనే నిష్ఫలమయిన నా జీవితం సఫలమయినట్లుగా నేను కన్నది ఒక కలమాత్రమే. ఆ కల అయినా అట్టేసేపు నిలవలేదు హఠాత్తుగా తెగిపోయింది. ఈ నిష్ఫల జీవితాన్ని ఈ రాత్రితో సాంతంచేస్తున్నాను. ఇది నా తప్పే. అయినా నువ్వు క్షమించగలవు. అనసూయ ఉత్తరం అంతా విని చంద్రమౌళి మానవా ఎంత స్వార్థపరులో, ఎంతసేపూ తనదృష్టి తాను నన్ను పోషించి నా సేవచేయాలటగాని, నామీద ఆమాత్రం ధైర్యంగా ఆధారపడలేకపోయింది' అన్నాడు అంతే. ఆవిషయం ఇద్దరూ మరి మాట్లాడలేదు. ఇప్పటికీ ఏటిఒడ్డున రాత్రులు షికారుతిరిగే వియోగులకు, విరాగులకు చంద్రమౌళి విషాద వీణాగానము వినిపిస్తూనే ఉంటుంది.

ANANDAVANI is printed by V. AZIZULLA at Deccan Times Press Madras
and published by V. KALIDAS, at 12 Thambu Chetty Street, Madras.
Editor: V. KALIDAS, Associate Editors : Andra Seshagiri Rao B.A., Mudda Viswanadham.